# బొమ్మ - బొరుసు

-గోవిందరాజు రామకృష్ణారావు

ఎక్కణ్నుంచి వస్తున్నాయ్!

ఎలా ఉబికి వస్తున్నాయ్!!


ఎన్నడూ ఎరగని వికృతాలోచనలు!!!

తెలియకుండా హృదయగర్భం అడుగున అట్టడుగున స్మృతి రేణువులోపున దాగిన విచిత్ర స్పందనలు పైకి ఎగసి, చిమ్ముకొస్తున్నాయి. మనస్సును కలచి వేస్తున్నాయి. కలవరపరుస్తున్నాయి.

'ఇంటికి పెద్ద కొడుకై పుట్టడం నిజంగా పాపమనిపిస్తుంది. ఊళ్ళో వున్న రేకుల షెడ్డు హైస్కూల్లో పదో తరగతితో చదువుకు స్వస్తి చెప్పక తప్పలేదు. ఆ వూరే సర్వ ప్రపంచమైపోయింది. కప్ప బతుకు. సేద్యంలో తండ్రికి సాయం చేయడమే వ్యాపకంగా మారింది. మగ్గంలో కండె మాదిరి ఇల్లూ, పొలం - ఈ రెండింటి మధ్య తిరగడంతో సరిపోతుంది. బురదలో, రొచ్చులో, చేలల్లో గట్లమీద పగలంతా గడపాలి. తాతలనాటి పాతకొంపలో కాపురం. ఈ రోజుల్లో ఇదెక్కడన్నా కనిపిస్తుందా? పదో తరగతి పరీక్ష సాంతం పూర్తికాకముందే కాలేజీ చదువుకు ప్రయత్నాలు మొదలవుతాయి. కాని నా విషయంలో అలా జరగలేదే. తలరాత కాబోలు. అదృష్టమంతా తమ్ముడి నొసటనే రాశాడు బ్రహ్మదేవుడు. ఒక్క బ్రహ్మదేవుడయితే ఇంత ఘోరం చేసేవాడుకాదు. ఉమాకాంతం మహాశయుడు - అంటే మా నాన్న - మరీ మరీ ప్రాధేయపడి ఇలా రాయించి వుంటాడు. లేకపోతే ఇంత నికృష్టంగా ఈ పల్లెటూళ్ళో బతకడమేమిటి? నా తర్వాత పుట్టిన రమేష్‌కి అదృష్టాలు కుప్పలు కుప్పలుగా పోగయ్యాయి. తాతగారి పేరు రామేశం అయితే మోడరన్‌గా వుంటుందని మా నాన్న అలా మార్చి పెట్టాడు. మరి ఈ ఆలోచన నే పుట్టినప్పుడు రాలేదు. ఎందుకొస్తుంది? కృష్ణమూర్తిట... నా బొందపేరూ నేనూ. జ్యేష్ఠమూర్తి అని పెడితే బావుండేది. అదృష్టహీనుడికి అన్ని వైపులా శనే తిష్ట వేసుక్కూర్చుంటాడు. మరో మాట లేకుండా తమ్ముణ్ణి కాలేజీలో చేర్పించాడు నాన్న. ఇంటరవ్వంగానే ఇంజనీరింగు చదివించాడు. ఇంజనీరింగంటే మాటలా? ఎన్ని వేలు కావాలి? అందుకే నాలుగెకరాల పొలం అమ్మవలసి వచ్చింది. బెంగుళూరులో పెద్ద కంప్యూటర్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ఉద్యోగం వచ్చింది. నెల తిరిగేటప్పటికి యాభై వేలు చేతిలో పడుతున్నా పదో పాతికో పంపాలన్న ఇంగితం వాడికి లేదు. ఉండదు. ఎందుకుండాలి. వాడికిప్పుడు నాన్నతో, అన్నతో పనేముంది. పబ్బం గడిచిపోయింది. అన్నీ సమకూరాయి. అన్ని అవసరాలు తీరాయి. పెళ్ళయింది. అత్త మామలది బెంగుళూర్. ఇంకా కావలసిందేవుంది. బంగారంలాంటి ఇద్దరు బిడ్డలు. సంతోషం. మామగారికి ఒక్కతే కూతురు. ఇంక చెప్పవలసిందేముంది. అంతమాత్రం చేత అందర్నీ మరచిపోవాలా? అమ్మ చచ్చిపోతే ఎవడో పరాయి వాడొచ్చినట్టు దహనం అయిన మర్నాడే వెళ్ళిపోయాడు. ఏదో కాన్ఫరెన్స్‌లో పాల్గోవాలట. అస్థి సంచయనం నేను ఒక్కణ్నే చేశాను. కర్మ సంగతి వేరే చెప్పనక్కరలేదు. సాంవత్సరీకాలకు కూడా వాడు రాలేదు. ఉత్తరం ముక్క కూడా రాయడు. ముందూ వెనకా చూడకుండా సగం పొలం తెగనమ్మి ఇంతవాణ్ణి చేసినందుకు ఈ శాస్తి మాకు జరగాల్సిందే. ఇందులో తప్పెవరిది? లోకం పరిస్థితుల్ని బట్టి ఆలోచిస్తే రమేష్ తన దారి తాను చూసుకోవడంలో ఆశ్చర్యం లేదనిపిస్తుంది. ఇక మా వైపు నుంచి ఆలోచిస్తే! మా ఆలోచన ఎవరికి కావాలి? మా బాధలు ఎవరికి కావాలి? ఒకవేళ ఇలా ప్రవర్తించడం న్యాయమేనా అని అడిగితే ఎవడు చదివించమన్నాడని తల వాచిపోయేటట్టు ఎదురు ప్రశ్న వేయకపోడు. తెగించిన వాడు రాజుకంటె బలవంతుడు. దేవుడు కూడా వాణ్ని చూసి జంకుతాడు.

మరి దేవుడికి నేనెందుకు లోకువయ్యాను? నా మీద ఎందుకంత కసి! అటు దేవుడూ, ఇటు నాన్నా నా నెత్తిన కష్టాల గంపలెత్తారు. చదువు





చట్టుబండలయింది కదా! పోనీ పెళ్ళయినా కలిసివచ్చేటట్టు చేశాడా మహాశయుడు – అదే మా నాన్న. మా అక్క కూతుర్ని ఇంటి కోడలుగా తెచ్చుకుంటానని మా అక్కా బావలకు మాటిచ్చాడు. మాటిచ్చాను తన్నుకు చావమన్నాడు. ఇలాంటి పెళ్ళిళ్ళు మంచివి కావని ఎక్కడో చదివాను. ఆ సంగతే మొత్తుకున్నా. అన్నీ మొండిఘటాలే. వినిపించుకునేదెవరు? తన కూతురు గౌరిని చేసుకోకపోతే పురుగుల మందు తాగి చస్తానని అక్క బెదిరించింది. అంతపని చేసి తీరుతుంది! కిక్కురుమనకుండా మూడు ముళ్ళూ వేసేశాను. అకారణంగా దేవుడు నామీద పగపట్టాడు. జడ్డి కొడుకు సాయినిచ్చాడు. వాణ్ణి పెంచడం ఎంత కష్టం? వాడీ జన్మలో ప్రయోజకుడవుతాడా? దగ్గరి సంబంధం చేసుకుంటే ఇలాంటి సంతానం కలిగే ప్రమాదం వుందని విని ముందే మొత్తుకున్నా ఫలితం లేకపోయింది. వాడి వైద్యం కోసమే బోలెడు ఖర్చవుతోంది. అయినా వైద్యానికి అందే లక్షణం కాదు సాయిది. దీనికంతా కారణం మా నాన్నే... ఏమ్మాటికీ ఆయనే. నా కష్టాలకు కారకుడాయనే. ఇప్పుడు మంచం పట్టాడు. వైద్యం చేయించాలంటే వేలకు వేలు కుమ్మరించాలి. ఎక్కడ తేవాలి? ఉన్న కాస్త పొలంలో అర ఎకరమన్నా అమ్మాలి. అమ్మితే తర్వాత గతేమిటి? జీవనాధారం తరిగిపోతే సంసారం ఎలా గడపాలి! పొలం అమ్మడమా లేదా అనేది పెద్ద ప్రశ్న! ఆయన చిన్నప్పటి నుంచి ఇప్పటిదాకా నన్ను కష్టాలలోనే ముంచెత్తుతున్నాడు. ఇంకా మరిన్ని బాధలు ఏరికోరి తెచ్చుకోలేను. పొలం ససేమిరా అమ్మకూడదు.'–

'నో.. నో.. అమ్మకూడదు!' కృష్ణమూర్తి గట్టిగా కలవరిస్తున్నాడు. ఇంకా పూర్తిగా తెల్లవారలేదు.

వీధి వాకిట్లో నీళ్ళు జల్లుతున్న గౌరి గబగబా లోపలికి వెళ్ళి గట్టిగా తట్టి భర్తను లేపింది. కృష్ణమూర్తి ఉలిక్కిపడి లేస్తూ అటూ ఇటూ గాబరాగా చూశాడు. గౌరికి ఏమీ అర్థం కాలేదు.

ఏమయిందోనని భయపడింది. ‘ ఏమయిందండి. అలా చూస్తున్నారేమిటి? ఆ కేకలేమిటి. ఎందుకలా కలవరిస్తున్నారు?’ ప్రశ్నల వర్షం కురిపించింది. కృష్ణమూర్తి తనకు వచ్చిన కలను గుర్తు చేసుకుంటూ గతుక్కుమంటూ మంచం దిగాడు.

అతని వైఖరి గౌరికి పాలుపోలేదు.

‘గౌరీ! నాన్నకెలా వుంది’ తత్తరపాటుతో అడిగాడు.

‘ఏమిటా పిచ్చిమాటలూ మీరూనూ? అయినా అంత మొద్దు నిద్రయితే ఎలా? మావయ్య మామూలుగా లేచి కాలకృత్యాలు తీర్చుకుని తమిద జావ తాగి పొలానికి వెళ్ళారు. మీరేమో వెర్రి కలలు కంటూ పెద్దగా అరుస్తూ పడుకున్నారు!’

‘సాధింపుకేమొచ్చెగాని నాన్నని చలిలో ఎందుకు పొలం వెళ్ళనిచ్చావ్?’

‘మీకు నిజంగా మతి చలించింది... లేకపోతే ఏమిటండీ. మామయ్య ఎప్పుడూ పొలం వెళ్ళే టైమేగా!’

కృష్ణమూర్తి తెప్పరిల్లే ప్రయత్నం చేశాడు. ఆయన మనస్సంతా తీవ్రంగా కలతపడుతోంది.

ముంగిట వున్న వేపచెట్టు కొమ్మ వంచి ఒక పుల్ల విరిచి నోట్లో పెట్టుకుని ‘గౌరీ! నేను పొలం వెళ్ళి నాన్నని చూసివస్తా...’ అంటూ జవాబుకోసం ఎదురుచూడకుండా పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ పొలం వైపు దారిపట్టాడు. గౌరి ‘అంతా తిక్క వ్యవహారం’ అని సణిగి వాకిట్లో ముగ్గు వేయడం ప్రారంభించింది.

కృష్ణమూర్తి పరుగులాంటి నడకతో పొలం వైపు సాగిపోతున్నాడు. ఏదో పెద్ద తప్పు చేసినట్లు మనస్సులో బాధపడుతున్నాడు.

‘ఎందుకింత నీచమైన కలవచ్చింది? నాన్న గురించీ, రమేష్ గురించీ నేనెప్పుడూ మరో విధంగా ఆలోచించలేదే. తమ్ముడు ప్రయోజకుడై పెద్ద ఇంజనీరయినందుకు గర్వపడుతున్నాను గదా! పరిస్థితుల వల్ల వాడు మా సంగతులు అంతగా పట్టించుకోలేకపోతున్నాడని నాకు తెలును. వాడంటే నాకు ఎంతో ఇష్టం. తెలివిగలవాడు. నాన్న విషయంలో నాకు ఇలాంటి కల రావడం ఎంత ఘోరం. నాన్నే నాకు దైవం. నాకోసం, నా సాయికోసం, గౌరి కోసం ఆయన రాత్రింబవళ్ళు ఆవేదన చెందుతున్నాడు. ఈ వయస్సులో కూడా పొలం పనులన్నీ ఆయనే స్వయంగా చూస్తున్నాడు. నేను ఎండలో నుంచుంటే నాన్న విలవిలలాడిపోతాడు. నాలుగు డబ్బులు వస్తాయని పక్క చేనుకూడా కౌలుకు తీసుకుని సాలుకు రెండు పంటలు పండిస్తున్నాడు. నాకు పై చదువులు చెప్పించలేకపోయానని లోలోపల కుమిలిపోతున్నాడు. రమేష్ వైఖరికి గుండె చెరువు చేసుకున్నా పైకి గంభీరంగా వుంటున్నాడు. అమ్మ కన్నుమూసిన తర్వాత కృష్ణారామా అంటూ ఇంట్లో కూర్చోవచ్చు. కానీ నా కోసం నాన్న శ్రమ పడుతున్నాడు. నా కోసం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ భారమంతా తానే మోస్తున్నాడు. ఇంతవరకు బస్తీ వైద్యం ఎరగడు. నా కెందుకు అలాంటి కల రావాలి? అదేదో పత్రికలో ఒకసారి చదివాను. మనసు పొరల్లో ఏదో మూల నలుసుల్లా మనకు తెలియకుండానే ఆలోచనలు నక్కి వుంటాయట. అర్ధచేతన స్థితి అని కాబోలు రాశాడు. నాన్నకు జబ్బు చేసినట్లు కల రావడం నేను చేసిన పాపం. పైగా వైద్యం గురించి వెనకా ముందూ వూగిసలాడడం మరింత పాపం. అమ్మ పోతూ పోతూ నాన్నచేతిని నా చేతిలో పెట్టి ఇక నుంచి నాన్నని పెద్ద కొడుకులా చూసుకోమని చెప్పింది. అలాగేనని మాట ఇచ్చాను. త్రికరణ శుద్ధిగా అలా చేస్తున్నాను. అయినా పాడు కల వచ్చింది. నాకు పాపం చుట్టుకుంది. ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. నాన్నని ఇక నుంచి శ్రమపడనీయను. ఒకసారి బస్తీ తీసుకువెళ్ళి ప్రయివేటు ఆసుపత్రిలో హెల్త్ చెకప్ చేయిస్తా. ఇవ్వాళ సోమవారం. రామలింగేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకం చేయించి తీరాలి. మెంటల్ రిటార్టెడ్ కొడుకు సాయి అయితే వయస్సు మళ్ళిన కొడుకు నాన్న. అమ్మ మాట అక్షరాలా పాటించాలి. అంతే.’–

కృష్ణమూర్తి ఒక నిర్ణయానికి వచ్చాడు. ఇంతలో పొలం చేరుకున్నాడు.

ఉమాకాంతం పనివాళ్ళ కోసం ఎదురు చూస్తున్నాడు. ఆ సమయంలో కొడుకును చూసి ఆశ్చర్యపోయాడు.

‘ఏంట్రానాన్నా కిష్టప్పా ఇప్పుడొచ్చావేంటి?’ కొంచెం ఆందోళనతో అడిగాడు.

కృష్ణమూర్తి తండ్రి దగ్గరగా వెళ్ళి ఆరాధనగా ఆపాదమస్తకం చూసి ‘ఒంట్లో ఎలావుంది నాన్నా. మరీ పొద్దునే వచ్చావ్?’ అని దిగులుగా అడిగాడు.

ఉమాకాంతానికి ఏమీ అర్థం కాలేదు.

కృష్ణమూర్తి అమాంతం తండ్రి కాళ్ళు పట్టుకుని

'నాన్నా నేను పాపం చేశాను. నీవు నాకు ద్రోహం చేసినట్లు భ్రమ పడ్డాను. నన్ను క్షమించు' అని భోరున ఏడ్చాడు.

ఉమాకాంతం గుండె కరిగిపోయింది. కళ్ళలో కన్నీళ్ళు సుడులు తిరిగి ఉబికి చెక్కిళ్ళపై నుంచి జారి కృష్ణమూర్తి భుజం మీద పడ్డాయి. కొడుకుని రెండు చేతులతో లేవనెత్తి అక్కున చేర్చుకున్నాడు.

"దీనికే ఇంత ఇదవ్వాలా పిచ్చితండ్రీ. నేను నిక్షేపంగా వున్నారా" కొడుకును సమాధాన పరిచాడు.

'నాన్నా నిన్ను వెంటనే బస్తీ తీసుకువెళ్ళి హెల్త్ చెకప్ చేయిస్తేగాని నా మనసు కుదుటపడదు. గుళ్ళో ఇవ్వాళే నీ పేరుమీద రుద్రాభిషేకం చేయించాలి. సరే అను నాన్నా' బ్రతిమాలాడు.

'ఒక షరతురా. సాయిని కూడా తీసుకువెళ్ళి పెద్ద డాక్టరు సలహా తీసుకుందాం. నేను గుండ్రాయిలా వున్నానుగదరా! ఎందుకు చెకప్‌లు. అయినా నీ కోసం సరే అంటున్నా. రుద్రాభిషేకం సాయి పేరనా, నీ పేరనా చేయిద్దాం. నీ మనస్సే సరిగా లేదు. కాదనకు. ఆ స్వామి దయవుంటే సాయి మామూలు మనిషవుతాడు. ఏమంటావ్?'

'నువ్వు చెప్పిన మాట ఎప్పుడన్నా కాదన్నానా నాన్నా'

'లేదురా... పద నేకూడా ఇంటిదాకా వచ్చి నిన్ను దిగపెట్టి వస్తా. నువ్వు బాగా కలతపడ్డావ్. అమ్మాయిని హడలకొట్టి వుంటావ్.'

ఇద్దరూ ఇంటివైపు సాగిపోయారు.

*

# రచయితలకు మనవి

సమగ్ర సాహిత్య మాస పత్రికగా 'పత్రిక'ను తీర్చిదిద్దడానికి మేము చేస్తున్న కృషికి సహకరిస్తున్న కవులు, రచయితలు, చిత్రకారులకు అభివందనాలు. పత్రిక పఠనాసక్తిని మరింతగా పెంచడానికి సాహిత్య వార్తలు, వ్యాఖ్యలు, విమర్శలు, కథలు, కవితలతో పాటు ప్రసిద్ధ రచయితల జీవితాలు, రచనా వ్యాసంగాలకు సంబంధించిన చిట్టిపొట్టి సంఘటనలు చమక్కులు, చమత్కారాలు ఎంతయినా ఉపకరిస్తాయి. పాఠకులను అలరించే ఇలాంటి టిట్‌బిట్స్ మీ దృష్టికి వచ్చినవి ఏవయినా వుంటే వాటిని 'పత్రిక'కు 'బిట్'ల రూపంలో వ్రాసి పంపండి! ప్రచురణకు స్వీకరించిన ప్రతి సంఘటనకు సముచిత పారితోషికం లభిస్తుంది.

డిసెంబరు సంచికలో రాష్ట్ర రాజధానిలో ఇటీవల జరిగిన సాహిత్య సభలు, పుస్తకావిష్కరణ సమావేశాలకు చెందిన వార్తలు, విశేషాలను ప్రచురించాం. ఈ సమీక్షలు కేవలం హైదరాబాదు నగరానికి మాత్రమే పరిమితమైనవి కావు. రాష్ట్రమంతటా జరిగే ఇలాంటి సభలు, సమావేశాల విశేషాలను వీలయినంత సమగ్రంగా ప్రచురించాలనేదే మా సంకల్పం. ఇది నెరవేరాలంటే ఆయా పట్టణాలలోని రచయితలు, సాహిత్యాభిమానుల స్వచ్ఛంద సహకారం అవసరం. ఆయా పట్టణాలలో జరిగే సభలు, సదస్సులకు మీరు హాజరై వుంటే, వాటి వివరాలను 'పత్రిక'కు వ్రాసి పంపండి! 'సభాపర్వం' కింద వాటిని ప్రచురిస్తాం. తగిన పారితోషికం పంపుతాం!

పత్రిక ప్రథమ సంచిక- మొత్తం మీద అందరి ఆదరాభిమానాలను చూరగొన్నది. పలువురు పలు సూచనలు చేశారు. కొందరు- తమ లేఖలలో యువ రచయితలకు కూడ తగిన ప్రాముఖ్యం ఇవ్వాలని సూచించారు. తప్పకుండా! కాకపోతే ఈ విషయంలో చొరవ రావలసింది యువ కథా రచయితల నుంచే! ఏ మట్టిలో ఏ మాణిక్యం వుందో తెలుసుకోవడం హైదరాబాదులో కూర్చున్న వారికి సాధ్యపడదు. అందువల్ల ఉత్సాహం కలిగిన యువ రచయితలు- తాము ఎన్నుకున్న కథాంశం ఏదయినా సరే, ఏ మాండలికంలో వున్నా సరే- అందరినీ చదివించేలా వ్రాసి పంపితే చాలు! వాటిని ప్రచురించే విషయం మేము చూసుకుంటాం! కథలు, వ్యంగ్య రచనలు, హాస్య కథలు, ఏకాంకిక హాస్య నాటికలు, హాస్య సంఘటనలు, జోక్స్- ఏవైనా సరే- వెల్‌కమ్!

-ఎడిటర్